అటుతిరిగి పడుకున్నా గడియారపుముల్లు బరువుగా కదులుతోంది

"వచ్చావా బాబాయ్! కాని ఏంలాభం? నేను అయిదురోజులు ముందుగా రమ్మంటే నువ్విప్పుడు వచ్చావు ఏవిటి లాభం? నా శ్రేయస్సు కోరిన వాడివి ఇలాగేనా చేయటం?"

"నేను వద్దామనే అనుకున్నా కాని లాభం లేకపోయింది హఠాత్తుగా జ్వరం వచ్చి పడి పోయాను."

"ఏవైతేనేం బాబాయ్! అంతా నా గ్రహ చారం! అనుకోకుండా జరిగిపోయింది అంధకారం నన్ను కబళించేసింది నేనేం చెయ్యను? నాలుగు రోజులు ముందు నువ్వు వచ్చుంటే నాకు మన శ్శాంతిని కలిగించేవాడివి"

వెక్కి వెక్కి ఏడ్పు

"ఏవిటిది సావిత్రీ! ఎందు కేడుస్తున్నావు? నీకు ఏమైనా మతిపోయిందా? ఈ శుభసమయంలో వృథాగా ఏడుస్తున్నావు?"

"శుభసమయం నాకుకాదు నీకు తెలియదు నేను అగ్నిగుండంలో పడిపోతున్నా అమ్మో! అగ్నిగుండం దావాగ్ని"

అవును, ఆకాశాన్ని ముద్దుపెట్టుకుంటున్న మంటలు, చుట్టూ పొగలు

"అమ్మో! సావిత్రీ! సావిత్రీ!"

"ఏవిటండీ ఇదంతా" అనరిచింది శారద కళ్లు నులుముకుంటూ గోడమీదున్న గడియారం కేసి చూశాను భ్రమలాంటి జీవితయాత్రలో ఇదో భ్రమ దీన్ని గురించి లోతుగా ఆలోచిస్తే సావిత్రి ఆత్మ నాదగ్గరకొచ్చి ఏదోచెప్తోందని భ్రమపడాలి

"పగటికల మీకు మతిపోయినట్టుంది ఎవ రైనా వింటే నవ్విపోతారు, ఆ అమ్మాయికీ మనకూ ఏవిటి సంబంధం? ఇలాంటివాళ్ళు వేలకొలది వుంటారు వీళ్ళందర్నీ చూసి ఏడవటమేనామనపని?"

ఈ మాటలు శారద అంతరాంతరాల్లోంచి రాలేదని నాకు తెలుసు మర్నాడు సాయం త్రానికి కాని జ్వరం తగ్గలేదు పెళ్ళిముహూర్తాని కైనా అందుకుంటానో లేదో నన్న అనుమానం కలిగింది మొత్తానికెలాగయితేనే, రేపు పెళ్ళనగా సాయంత్రానికి అక్కడికి చేరుకున్నాం

(ముగింపు వచ్చే సంచికలో)

కథానిక

నిద్రలో భద్రయ్య

"రాంగేయ"

"సావిత్రి" నాటకం మహాజోరుగా సాగిపో తూంది నాటకం చూస్తున్నంతసేపూ భద్రయ్య తన్మయత్వంలో మునిగిపొయ్యాడు ఆహాహా! ఏం నాటకం! యేం నాటకం! నిజంగా యముడివేషంలో రంగమార్తాండుడి నటన అద్భు తంగా వుంది భయంగొలిపే ఆ ఆకారం, చెవుల్ని బ్రద్దలుచేసికొని గుండెల్లో దూరి, గుభేలుమనిపించే ఆ గంభీర కంఠధ్వని ఆహా అచ్చంగా యముడి లాగే వున్నాడు రంగమార్తాండుడు (అసలు యముణ్ణి వీడు చూసినట్లే!) యముడే రంగమార్తాం డుడు! రంగమార్తాండుడే యముడు!

నాటకం వదిలాక బసచేరుకున్నా, ఆలోచనలు మాత్రం భద్రయ్యని వదల్లేదు నిజంగా "సావిత్రి" గొప్ప నాటకం అందులోనూ యముడి పాత్ర ఆ నాటకానికి జీవం తనకీ చిన్నప్పటినుంచీ నాట కాలంటే మహా సరదా ఏకాటికైనా తనూ ఓ నాటకం ఆడి పేరుసంపాదించాలని తహతహ

ఆరు నూరుగాని, నూ రారుగానీ, యీసారి నాటకం ఆడితీరవలసిందే అని నిశ్చయించుకున్నాడు భద్రయ్య అందులోనూ "సావిత్రి" నాటకమే ఆడాలి తను యముడి పాత్రకి ఫిట్ తనకేం? తను రంగమార్తాండుడికి యే విధంగానూ తీసిపోడు ఆమాటకొస్తే నిమ్మకాయలు నిలబెట్ట గల తన మీసాలే చాలు కట్టుమీసాలు అక్కరేలేదు

ఇక పోతే సావిత్రి వేషం గోపాలంగాడితో వేయించొచ్చు వాడూ నాటకాలంటే పడి

చస్తాడు అందులోనూ ఆడవేషాలు వేయడమంటే వాడికి మహాచెడ్డ సరదా! వాడు మిషనుకుట్టుకుంటూ "ఇకనే గీచినగీటు దాటనని . " అనే పద్యం పాడుతూవుంటే, ఆ పాడేది ఆడమనిషేమోనని తనూ మోసపోయిన రోజులు లేకపోలేదు

మిగిలిందల్లా నారద పాత్ర అందుకు తగిన వాడు ఆచారి వొక్కడే! వాడు మహాచక్కగా పాడగలడని ఆ చుట్టుప్రక్కలంతా ప్రతీతి అందుకే వాడికి మహా గర్వం తనకి సంగీతంకూడా వచ్చని గొప్పగా చెప్పుకుంటూ వుంటాడు కాని వాడి పాటలో శాస్త్రీయ లక్షణాలు తనకెక్కడా కనిపించలేదు వాడు నవరాత్రుల భజనలూ అవీ జరిగేటప్పుడు పాటమధ్యలోనే ఆపి "సరిగపమా"అంటూ స్వరంవేస్తుంటాడు అదీ సారథి హార్మోనియం వాయిస్తుంటేనే! వాడూ వీడూ తోడుదొంగలు వాపీ వరుసాలేకుండా వాడు పాడినట్లల్లా వీడు వాయిస్తూ 'హాయ్! హాయ్'అని వాణ్ణి ఆకాశాని కెత్తుతుంటాడు నేవూ వీడికి వాటా దొరకదు మరి! కాకపోతే వీడికి సంగీతమేమిటి?అందరూ వినేటట్టు 'అరేయ్! మోహన వాయించరా'అని గొంతు సవరించి ఆలాపన మొదలుపెడితే అప్పుడప్పుడు గోదావరిగట్టున కూర్చుని మోరెత్తి యేడ్చే గ్రామ సింహాలు జ్ఞాపకాని కొస్తాయి అయినా వాడెలాటివాడైతే మనకేం? వాడు పాటగాడని నలుగురికీ నమ్మకం-ఆ పుకుబడినే మనం సద్వినియోగం చేసుకోవాలి వాడి నోగయినా సరే యీ లంపటంలోకి లాగి వాడిచే నారదవేషం వేయించాలి.

తెల్లవారే పుస్తకాల దుకాణంలో"సావిత్రి" నాటకపుస్తకం కొనుక్కొని భద్రయ్య స్వగ్రామం చేరుకున్నాడు

భద్రయ్య నాటక సన్నాహాలన్నీ పూర్తయాయి శ్రీరామ నవమినాడు చింతాద్రివారి పొగాకు పాకలో నాటకం ఆడివేయడానికే నిశ్చయించుకొన్నారు

ఈలోగా భద్రయ్య యముడి పాత్రని దిగ్విజయంగా నటించడానికి చేసిన ప్రయత్నాలు అన్నీ యిన్నీ కావు వాళ్ళ రిహార్సల్సుకి వూరువూరే మోతమోగిపోయింది పైగా రంగ మార్తాండుడి లాగా, స్టేజిమీదికి మహిషవాహనంమీద రావాలని కరణంగారి గానుక దున్నపోతుని అడిగిపుచ్చుకొని, మిట్ట మధ్యాహ్నమప్పుడు లంకల్లో స్వారీ చేయడం మొదలుపెట్టాడు భద్రయ్య

నాటకంరోజు రానే వచ్చింది టిక్కెట్టులేని నాటకం గనుక - వూళ్లోవాళ్ళంతా పాలికాపు మొదలుకొని ఖామందువరకూ సకుటుంబ సమేతంగా వచ్చి చింతాద్రివారి పాకలో క్రిక్కిరిసిపోయారు

చూస్తూచూస్తుండగానే, భద్రయ్యగారి నాటకం తెర లేచింది అశ్వపతి మహారాజులుంగారు ఆసనం అలంకరించివున్నారు నారదుడి వేషంలో వున్న ఆచారి, సైడుకర్టెను వెనకవుండి ' బాలా ఇందిరా ప్రభో" అని పాడుతున్నాడు ఆచారి ఆపూట మెడసన్నం గోవిందం బాగానే సేవించాడు! కళ్లు చింతనిప్పుల్లాగా వున్నాయ్ పాటైతే తెర వెనకనించి ఎలాగో పాడేశాడుగాని, స్టేజిమీదికి రావడానికి కాళ్ళు తడబడుతున్నాయి ఎలాగో యివతలకి వచ్చి ఒకసారి జనంవంక చూశాడు ఇంకేముంది-ఆచారి గుండె లలిసిపోయాయి ఎటు చూచినా జనమే, ఆచారికి కాళ్ళు గజగజా వొణుకుతున్నాయి, ముచ్చెమటలు పోస్తున్నాయ్

అశ్వపతి మహారాజులుగారి గతీ అంతే అయింది ఎదురుగా నాయుడుగారు కూర్చున్నారు అసలాయన్ని వుట్టిప్పుడు చూస్తేనే, రాముడుగాడికి భయం అందులోనా తను వేషం కడితే-ఆయన ఎదురుగా యముడల్లే కూర్చునే! ఆయనముందు యీ చమ్కీకోటుతో ఈ రాత్రికి రాజుగారిగా నటించి, తెల్లారి ఆయనదగ్గర పాలికాపుతనం చేయబోతే—యీలోగా నారదుడు తడబడుతూ

"ర ర రాజేంద్రా!" అన్నాడు

ఉగ్రసేనుడు ఉలిక్కిపడి

"ము మ్ము మ్మునీంద్రా!" అన్నాడు

నారదుడు మళ్ళీ "రా రాజేంద్రా"అన్నాడు

అశ్వపతి వణుకుతూ "ము మునీంద్రా" అన్నాడు

పాపం ఆచారి సగం మైకంలో సగం తడబాటులో పోర్షను మర్చిపోయాడు అసలే ఎదురుగావున్న నాయుడుగార్ని చూచి బెదిరిన రాములుకి ఆచారివాలకం చూచి బెంబేలెత్తిపోయి- వచ్చిన తన పోర్షనుగూడా మర్చిపో

యాడు యిద్దరూ 'రాజేంద్రా' అంటే 'మునీంద్రా' అని కుస్తీపట్టడం మొదలు పెట్టారు పాపం! పోర్షనందించే భద్రం మేష్టారు వీళ్ళిద్దరికీ పోర్షను క్షుణ్ణంగా వచ్చునుగదా అన్న ధీమాతో లోపలికి వెళ్ళి సావిత్రి చీర సరి చేస్తున్నాడు

బయట వీళ్ళ "రాజేంద్రా" "మునీంద్రా!" కుస్తీ భరించలేక జనంలో కలకలం బయల్దేరింది

"ఏడిశావులే తరవాతి కూతేదో కూసెయ్యరా" అన్నాడొకడు

"పోర్షను అందివ్వరా బాబూ" అని మొత్తుకున్నాడు మరో మూలనుంచి ఒక ప్రేక్షకుడు-

పాపం ఆచారికి ఏడుపొచ్చినంత పనయింది పోర్షను జ్ఞాపకానికి తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ మళ్ళీ "రాజేంద్రా!" అన్నాడు

ఉగ్రసేనుడు నిజంగానే వణికిపోతూ

"మునీంద్రా"అన్నాడు సగం ఏడుపుధోరణిలో

"అదేంట్రా! సన్నాసీ – ఎంతసేపూ అదే కూతట్రా?"అన్నారు పాపం నాయుడుగారు ఓపిక పట్టలేక ఈ గోలంతా విని సావిత్రి సింగారం వొదిలి పెట్టి భద్రం మేష్టారు పరుగెత్తుకొచ్చారు

ఈలోగా సావిత్రి వేషంలో వున్న గోపాలం ఏమిటో యీగోల చూద్దామని తెర పక్కకి తొలగించి జనంలోకి చూచేడు వెంటనే వాడు "అమ్మ బాబోయ్!" అని ఒక్కకేకవేసి వెనక్కి పరుగెత్తేడు యింత జనం ముందు తను ఆడవేషంవేసి నటించడమే! అంతదమ్ములున్న ఆచారికే తాటాకులు తప్పలేదుగదా యిక తనగతేంగాను–అందులోనూ రవణమ్మ యెదురుగా కూర్చొని వుండే! అది చూస్తుండగా యిందర్లో చీరగట్టుకొని–యీ రాత్రి ఒక చచ్చినాడికోసం "నాథా!" అంటూ యేడ్చి–ఛత్ యీ వేషం వేయడం తనవల్లకాదు

గోపాలం చీర వూడదీసి చంకని బెట్టుకొని తిరిగి చూడకుండా వెనక దారిగుండి వుడాయించేడు

పాపం! ఇదంతాచూచి భద్రయ్యకి గుండె బేజారయిపోయింది ఒక ప్రక్క జనం గోల ఇటు చూడబోతే గోపాలం వుడాయించేడు వాడికోసం నారాయణా, సీతయ్యా పరిగెత్తారు. యిక యీ నాటకం సాగేదెట్లా? తను స్టేజిమీదకి రాకుండానే యీ నాటకం ఆభరవుతుందేమో! అయ్యో! తనుగన్న కలలన్నీ యిట్లు కరిగిపోవలసిందేనా?

జనం గోల మరీ యెక్కువతువుంది ఆచారి తూలుతున్నాడు పారిపోయిన సావిత్రి ప్రవేశించలేదు యీలలూ, చప్పట్లూ మొదలయ్యాయి యీ గోలకి మహిషవాహనం బెదిరి, తాడు త్రెంచుకొని వుడాయించింది దాన్ని పట్టుకోవడానికి వచ్చిన, భద్రయ్యని ఒక్క కమ్మకుమ్మేసరికి భద్రయ్య వెనకవున్న రాటకి ఢీ కొట్టుకొని "అమ్మా" అంటూ చాపచుట్టలాగ పడిపొయ్యాడు

బయటిజనం గోల నూతిలో గొంతుకల్లా వినిపిస్తూంది భద్రయ్యకి వున్నట్లుండి భద్రయ్య కళ్ళముందు ఒక ఆకారం గోచరించింది యముడు మహిష వాహనంమీద వొస్తున్నాడు భలే! ఆ యముడు అచ్చంగా తనలాగే వున్నాడు లసలాగా మేమిటి! తనే అది అందుకేమీ సందేహం లేదు యముడు తనవేపే వొస్తున్నాడు యముడు తనమీద పాశంవేసి

"డింభకా! నీ యాయువు మూడినది రమ్ము" అంటున్నాడు యముడు చుట్టూ కలయజూశాడు భద్రయ్య ఆ చీకట్లో యెవరూలేరు యముడు మళ్ళీ అదే మాటంటున్నాడు పక్కన సావిత్రయినా లేదు—తనని రక్షించడానికి పోనీ శివలింగమన్నా కనిపిస్తే మార్కండేయుడిలాగ కౌగలించుకునేవాడు యముడు మళ్ళీ గర్జించాడు "డింభకా! నీ యాయువు మూడినది రమ్ము" అని నిజంగా భద్రయ్యకి తన ప్రాణం పోతున్నట్లనిపించింది యేమి చేయడానికి తోచలేదు "పరేతినాథా!" అని ఒక్కకేక పెట్టాడు భద్రయ్య

ఆ కేకవిని వంటింట్లోవున్న రుక్మిణమ్మ అదిరిపడి పరుగెత్తుకుంటూ వచ్చింది

"ఏవండీ! పట్టపగలే కలవరిస్తున్నారు? కలలో గూడా నాటకాలే ఆడుతున్నారే?" అంటూ భద్రయ్యని తట్టి లేపింది

"సావిత్రీ! వచ్చితివా?" అంటూ రుక్మిణమ్మని గట్టిగా కౌగలించుకొన్నాడు భద్రయ్య

"ఏవండీ! మీకేమన్నా మతి చలించిందా లేక గాలిగానీ సోకిందా! నేనండీ రుక్మిణిని"

"ఓస్ నువ్వేనా! హమ్మయ్య!" అంటూ నిబ్బరంగా నిట్టూర్చి, లేచాడు భద్రయ్య ★